# భక్తిమార్గం.. ధనుర్మాసం





నిజామాబాద్ నగరంలోని జెండా బాలాజీ ఆలయంలోని మూలవిరాట్

- నేటి నుంచి ధనుర్మాసం ప్రారంభం
- ముస్తాబైన వైష్ణవాలయాలు
- నెలరోజులపాటు

ఆధ్యాత్మిక శోభ



తిరుప్పావై ప్రవచనం చెబుతున్న శ్రీధరాచార్యులు (ఫైల్ ఫోటో)

**శ్రావణ...మాఘ... కార్తికమాసంతోపాటు హైందవ సంస్కృతిలో ధనుర్మాసానికి ఎంతో ప్రత్యేకత ఉన్నది. ఈ మాసంలో భక్తులు మహావిష్ణువును కొలుస్తారు. దీంతో ప్రతి వైష్ణవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తే మహాలక్ష్మి కరుణాకటాక్షాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఎన్నో విశిష్టతలు, ప్రత్యేకతలు ఉన్న ధనుర్మాసం (మార్గశిరమాసం) సంక్రాంతి కన్నా నెల ముందు ప్రారంభమవుతుంది. నేటి(ఆదివారం) నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం ఉంటుంది. దీనినే సంక్రాంతి నెల అని కూడా అంటారు.**

**-నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 16**

### ధనుర్మాసం ప్రాముఖ్యత

ధనస్సురాశిలోకి సూర్యుడు ప్రవేశించిన కాలం ధనుసంక్రమణం. ధనుర్మాసం మొత్తం ఆధ్మాత్మికంతో ముడిపడి ఉంటుంది. ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం. గోదాదేవి కథ, వ్రతం ఈ మాసానికి సంబంధించినదే. అందుకే తిరుప్పావై పఠనం, గోదాదేవి కల్యాణం తదితర ప్రత్యేక కార్యక్రమాలతో ఈ మాసం ఆధ్యాత్మికత వెల్లువిరుస్తుంది.

### తిరుప్పావై

అవివాహితులు మంచి భర్త లభించేందుకు చేసే నోముకు సంబంధించిన రచనే తిరుప్పావై. తెలుగు భాషకు పట్టాభిషేకం చేసిన విజయనగర సామ్రాజ్యం రారాజు శ్రీకృష్ణదేవరాయలు తాను రచించిన 'అముక్త మాల్యద' తమిళభాషలో తిరుప్పావైగా రాశారు. ఇందులో మొత్తం 30 పాశురాలు ఉంటాయి. ఒకొక్క పాశురం ఒకొక్క భక్తి మార్గాన్ని గోదాదేవి ఆరాధించే శ్రీమన్నారాయణుని వర్ణన, భక్తితో చేసే తులసీమాల అలంకరణ తదితర అంశాలు ఉంటాయి. వీటిని పండితులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు వినిపిస్తారు. చివరి రోజైన జనవరి 14న తిరుప్పావై ప్రవచనం ముగించి గోదా కల్యాణం చేస్తారు.

### జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు..

సకల కళలకు నిలయమైన ఇందూరు నగరంలో టీటీడీ ఆళ్వారు దివ్య ప్రబంధ ప్రాజెక్టు అనుమతితో ధనుర్మాస ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మపురి చక్రం గుడిలో సేనాపతి సంపత్‌కుమారాచార్యులు, సుభాష్‌నగర్ రామాలయంలో సముద్రాల శ్రీధరాచార్యులు, జెండా బాలాజీ మందిరంలో శ్యాంసుందరాచార్యులు తిరుప్పావై ప్రవచనాలను వినిపించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.




### భక్తుల సహకారంతోనే ఆశ్రమం అభివృద్ధి

భక్తుల సంపూర్ణ సహకారంతోనే ఈ ఆశ్రమం అభివృద్ధి చెందుతున్నది. ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకుని ఆధ్యాత్మిక మార్గంలో నడవాల్సిన అవశ్యకతను గుర్తించాలి. వార్షికోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలి.

– పిట్ల కృష్ణ మహరాజ్, ఆశ్రమ వ్యవస్థాపకులు



## నేడు లింగేశ్వర గుట్ట ఆశ్రమ వార్షికోత్సవం

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 16:నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్లారం గ్రామశివారులో ఉన్న లింగేశ్వర గుట్ట ఆశ్రమం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ భక్తుల మన్ననలు పొందుతున్నది. ఈ ఆశ్రమ ఆవరణలో నిర్మించిన శివాలయం భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తున్నది. నేడు ఆశ్రమ 14వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం 321 మంది జంటలతో శివునికి అభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చన, లలిత సహస్రనామ కార్యక్రమాలు ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించనున్నారు. ఉత్సవాలకు తొగుట పీఠాధిపతి శ్రీ మధుసూదనానంద స్వామీజీ హాజరై భక్తులకు ప్రవచనాలు బోధించనున్నారు.

### ఆహ్లాదకరం.. ఆధ్యాత్మిక వాతావరణం

ఆహ్లాదకర, అధ్యాత్మిక వాతావరణంతో ఆకట్టుకుంటున్న లింగేశ్వర గుట్ట ఆశ్రమాన్ని పిట్ల కృష్ణ మహరాజ్ 25 ఏండ్ల క్రితం మల్లారం శివారులో స్థాపించారు. దట్టమైన అటవీ ప్రాంతంలో తొలుత చిన్న పందిరి వేసి సాధన ప్రారంభించిన పిట్ల కృష్ణ మహరాజ్ శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రతిరోజూ పూజలు చేస్తూ వచ్చారు. భక్తుల రాకపోకలు ప్రారంభం కావడంతో ఆశ్రమం రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఆశ్రమ ఆవరణలో శివాలయంతోపాటు దత్తాత్రేయ, కాలభైరవ, నటరాజ, అమ్మవారి ఆలయాలున్నాయి. ఆశ్రమం ఆధ్వర్యంలో 220 ఆవులతో గోశాలను నిర్వహిస్తున్నారు.



గోశాలకు చెందిన ఆవులు